క్లుప్తంగా

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ గురుప్రసాద్

ధర్మవరం అర్బన్: మత్తు పదార్థాలు వాడటం వల్ల జీవితాలు నాశనమవుతాయని సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. పట్టణంలోని పద్మావతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం సెబ్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తు పదార్థాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారన్నారు. వాటిని ఉపయోగించడం వల్ల అనారోగ్యానికి గురై చివరికి మరణించే స్థాయికి చేరుకుంటారన్నారు. మత్తు పదార్థాలు వాడుతున్నారని తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని బాగా చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపకులు, సెబ్ పోలీసులు పాల్గొన్నారు.

వ్యాపారాలు అభివృద్ధి చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణా అధికారి మధుసూదన్

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్, డీఈ సురేంద్రబాబు, డిపో మేనేజర్ సత్యనారాయణ వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం వ్యాపారవేత్తలకు టెండర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బత్తలపల్లి బస్‌స్టేషన్ వద్దనున్న 9341 చదరపు గజముల ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల లీజు ప్రాతిపదికన టెండర్లు పిలిచామన్నారు. వ్యాపారులు టెండర్లు వేసుకుని స్థలాన్ని వ్యాపారానికి అనువుగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ యూనియన్ల నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి



విద్యాసామగ్రి అందిస్తున్న దాత ఓబిరెడ్డి, ఎంఈఓ సుధాకర్‌నాయక్ తదితరులు

బత్తలపల్లి: గ్రామాభివృద్ధిలో యువత, ఉద్యోగులు భాగస్వాములు కావాలని ఎంఈఓ సుధాకర్‌నాయక్ సూచించారు. శుక్రవారం ఈదుల ముష్టూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్టిబాల ఓబిరెడ్డి రూ.15 వేలు విలువైన పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కలర్ పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఓబిరెడ్డిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలో ఉన్న ఉద్యోగులు, ఉన్నతమైన వారు తమ సొంత గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ వాళ్లు చదువుకున్న ప్రతి సొంత ఊరికి ఏదో కొంత చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సూర్యప్రకాష్‌రావు, మరినేని కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు డీసీ కేశవులు, సునీత, వాణి, భాగ్యలక్ష్మి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి



మాట్లాడుతున్న జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ స్టేషన్ ఆవరణలో హెల్మెట్ల వాడకం, రోడ్డు ప్రమాదాల నివారణపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు రికార్డులు దగ్గర ఉంచుకోవడమే కాకుండా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. అలాగే కార్ తోలే సమయంలో తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలన్నారు.సెల్‌పోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి కొని ప్రమాదాలు తెచ్చుకోవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ఏదైనా ప్రమాదం జరిగితే వాహనం తోలే వారితో పాటు వారి తల్లిదండ్రులు చట్ట ప్రకారం బాధ్యులవుతారన్నారు. 18 ఏళ్ల పై బడిన వారికి మాత్రమే వాహనాలు నడిపేందుకు ఇవ్వాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదమన్నారు. వాహనాలకు ఏటా బీమా తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి



ఎన్‌కుంటలో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ రాము, అధికారులు



నల్లమాడలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగభూషణం



తాడిమర్రిలో మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

ఎన్పీకుంట: మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు మండల అభివృద్ధికి సహకరించాలని మండల ఎంపీపీ ఈటెరాము కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, భక్తుల సౌకర్యార్థం తిరుపతి, తిరుమలతో పాటు శ్రీశైలం వరకు కదిరి డిపో నుంచి ఎన్.పీ.కుంట, రాయచోటి మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కదిరి నుంచి రాయచోటికి వచ్చే బస్సులు సరైన సమయానికి రావడం లేదని, టైం టేబుల్‌ను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించడంతోపాటు గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీశారు. భవిష్యత్తులో మండలంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణమ్మ ఈఓఆర్డీ మనోహర్, వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు సర స్వతి, లక్ష్మిదేవి, క్రిష్ణమ్మ, తిమ్మారెడ్డి, సర్పంచ్ రాధమ్మ వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

నల్లమాడ: వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కే. సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ, ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు, కొళాయిల వద్ద మురుగునీరు, చెత్తాచెదారం నిల్వ ఉండకుండా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, తద్వారా దోమల వృద్ధిని అరికట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని ఎంపీపీ సునీతాబాయి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. సబ్సిడీ విత్తన కంది, పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సుమతి కోరారు. పక్కా గృహాల లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు మంజూరుతో పాటు సిమెంట్ పంపిణీ, నూతన గృహాల మంజూరుకు ఉన్నతాధికారులు అంగీకారం తెలిపినట్లు హౌసింగ్ ఏఈ సుమన్‌నాయక్ తెలిపారు. ఏపీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ ఐదెకరాల్లోపు భూమి కలిగిన చిన్న,సన్నకారు రైతులు ఉపాధి హామీ కింద పండ్లతోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండో వైస్ ఎంపీపీ ఉత్తమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, ఎంపీడీఓ మహమ్మద్ దౌలా, తహసీల్దార్ నాగభూషణం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శశికళ, మండల వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, ఏపీఎం జయంతి, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

తాడిమర్రి: సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ప్రజా ప్రతినిధులు, మండల అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మణి మంజిరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీకురావాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులకు సూచించారు. వైద్యాధికారి హరిత మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో డయేరియా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు సేవించాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌శేఖర్ మాట్లాడుతూ ఇప్పటి నుంచి ఇళ్లకు 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు వ్యవసాయ మోటర్లకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. అనంతరం రామాపురం, మరవపల్లి గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సర్పంచులు, ఎంపీటీసీలు తెలపగా వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీకి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణమోహన్, ఏఓ రమాదేవి, ఏపీఓ సంజీవరెడ్డి, ఏపీఎం సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది సుమలతకు గౌరవ డాక్టరేట్



సుమన్ చేతులమీదుగా డాక్టరేట్ అందుకుంటున్న సుమలత

ధర్మవరం అర్బన్: ధర్మవరం న్యాయవాది సుమలతకు హానరరీ డాక్టరేట్ అవార్డు దక్కింది. సుమలత ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ లీగల్ అడ్వైజర్‌గా ఉంటూ పలు సమస్యలను పరిష్కరించారు. వాటిని గుర్తించి ఈనెల 11న హైదరాబాద్‌లో అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు న్యాయవాది చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీనటుడు సుమన్ ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు.

ఉద్యమాలకు ఊపిరి పోయండి



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ధర్మవరం రూరల్: డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలకు ఊపిరి పోయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పోతుకుంట జెడ్పీ హైస్కూల్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేయాలన్నారు. గొట్లూరు, నాగలూరు, ధర్మపురి, రావుల చెరువు, దర్శనమలలోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ధర్మవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజనేయులు, జనార్దన్‌బాబు, నాయకులు వెంకట్‌కిశోర్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో పీసీఎంఆర్ విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం: ఇండియన్ ట్యాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో రూపరాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. నాగలూరు వద్దనున్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో శుక్రవారం ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ట్యాలెంట్ ఒలింపియాడ్ పరీక్షల్లో సాయి షమిత రెడ్డి, హెన్సిక స్టేట్ టాపర్స్‌గా నిలిచి నగదు బహుమతి సాధించారన్నారు. ఆరుగురు విద్యార్థులు ఎక్సలెంట్ మెడల్, 25 మంది గోల్డ్ మెడల్స్, 15 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు.

ఘనంగా రెడ్ డే...

పాఠశాలలో ఎరుపు రంగు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎరుపు వస్త్రాలు ధరించేవారు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. తెలిపారు. పాఠశాల డైరెక్టర్ రూపరాజా కృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



ప్రియాంక

బత్తలపల్లి: రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బండి ప్రియాంక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

కుష్టు వ్యాధిపై గ్రామాల్లో సర్వే



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ రవి నాయక్

చెన్నేకొత్తపల్లి: ఈనెల 17 నుంచి మండలంలోని గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సిబ్బందికి సూచించారు. ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ఇతర సిబ్బందితో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. లెప్రసీ (కుష్టు) లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలన్నారు. లెప్రసీ నిర్మూలనకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వెల్లడించారు. లెప్రసీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఆశావర్కర్లు రోజూ 30 ఇళ్ల సర్వే చేసి వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు రెండులోపు సర్వే పూర్తి చేయాల్సి ఉంటుదన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు హాజరయ్యారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో నిత్యావసరాలను పరిశీలిస్తున్న అధికారులు

తాడిమర్రి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి విజేంద్ర ప్రసాద్ ప్రిన్సిపాల్ వాణిశ్రీని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ మణి మంజిరి, ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్‌తో కలసి స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంటగది, స్టోర్ రూమ్, వాష్ రూమ్‌లను పరిశీలించారు. కేజీబీవీలో నిల్వ చేసిన కూరగాయలు, బియ్యం తదితర నిత్యావసర సరుకులను పరిశీలించారు. తాగునీరు, తరగతి గదులు, వసతి గదులను పరిశీలించి పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఓ సంజీవరెడ్డి, పీఆర్ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రిజ్వానాబేగం, జూనియర్ అసిస్టెంట్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రోటర్‌కు చిక్కుకుని రైతు మృతి

పావగడ: ఐవార్లహళ్లికి చెందిన రైతు ఆనందప్ప రోటర్‌కు చిక్కుకుని మృతి చెందాడు. బాధితుడు ఆనందప్ప ఇటీవలే కొత్తగా తెచ్చిన ట్రాక్టర్‌కు రోటర్ తగిలించుకుని శుక్రవారం భూమిలో గడ్డిని తొలగిస్తున్నాడు. ఈ సందర్భంగా రోటర్‌కు గడ్డి చిక్కుకోవడంతో గడ్డిని తొలగించడానికి ట్రాక్టర్‌ను ఆన్‌లో పెట్టి కిందకు దిగాడు. రోటర్‌కు ఉన్న గడ్డి తొలగించే ప్రయత్నంలో ట్రాక్టర్ వెనక్కి వచ్చింది. రోటర్ తగలడంతో ఆనందప్ప ముఖం, కాళ్లకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులను వెంటనే అతడ్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో బాధితుడిని బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





తీవ్రంగా గాయపడిన రామక్రిష్ణ , చిరంజీవి

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు..బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన రామక్రిష్ణ, గొట్లూరు గ్రామానికి చెందిన చిరంజీవి బైక్‌లపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా వుండడంతో అనంతపురం తీసుకెళ్లారు. రూరల్ పోలీసులు కేసు విచారిస్తున్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని బిల్వంపల్లిలో ఓ మహిళ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన కళమ్మ కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఈక్రమంలో శుక్రవారం ఇంట్లో పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన



బంజారా సంప్రదాయ దుస్తులతో విద్యార్థుల ప్రదర్శన

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం నాక్ (నేషన్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) బృందం సభ్యులు సందర్శించారు. నాక్ చైర్మన్ ప్రొఫెసర్ క్రిష్ణ పిళ్లై పద్మాకర్, కో ఆర్డినేటర్ అన్నాసాహెబ్, సభ్యుడు పాల్ న్యూమెన్‌కు కళాశాల ప్రిన్సిపల్ డా. స్మిత పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో వివిధ విభాగాలలో జరిగిన అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ కమిటీ కో ఆర్డినేటర్ హైదరాలి తెలియజేశారు. అనంతరం కళాశాలలోని సైన్స్ ల్యాబ్, సెంట్రల్ లైబ్రరీ, జిమ్, కెరీర్ గైడెన్స్ సెల్ పరిశీలించారు. ఆయా విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి కళాశాలలోని వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నామినీ జ్ఞానేశ్వర్, అధ్యాపకులు శివప్రసాద్, నారాయణస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గొర్రెల మృతి

పావగడ: తాలూకాలోని పళవల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో 5 గొర్రెలు మృతి చెందగా 20కి పైగా గొర్రెలు తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. గొర్రెల యజమాని ముత్యాలప్ప గొర్రెలను దొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో పదికి పైగా వీధి కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి గొర్రెలపై దాడి చేశాయి. ఈ దాడిలో 5 గొర్రెలు మృతి చెందగా.. మరో 20కి పైగా గొర్రెలు గాయపడ్డాయి. పశువైద్యాధికారి హొరకేరప్ప సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతి చెందిన గొర్రెలకు పంచనామా చేశారు. గాయపడిన గొర్రెలకు వైద్య చికిత్సలు అందించారు. తనకు నష్ట పరిహారం చెల్లించాలని గొర్రెల పెంపకంతో జీవిస్తున్న ముత్యాలప్ప అధికారులను కోరారు.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి



విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: మొహర్రం(పీర్ల పండుగ) నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లో పీర్ల పండుగ చేయాలనుకునేవారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలకు అవసరమైతే పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లోని మసీదులు, పీర్ల చావిడి వద్ద డీజేలు సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. ప్రశాంతంగా పీర్ల పండుగను జరుపుకోవాలన్నారు. పీర్ల చావిడి రాత్రి సమయంలో గుంపులు, గుంపులుగా డీజే సౌండ్ల తప్పెట్లతో డ్యాన్స్ చేయరాదన్నారు. పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మందు తాగి డ్యాన్స్, వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలు జరిగినట్లయితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

శాకాంబరీదేవిగా పెద్దమ్మ తల్లి



పూజలందుకున్న పెద్దమ్మతల్లి

ధర్మవరం అర్బన్ : ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా పట్టణంలోని సాలేవీధిలోనున్న పెద్దమ్మ తల్లి శాకాంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు బుగ్గ వంశస్తుల ఆధ్వర్యంలో అర్చకులు వెంకటేశ్వరశర్మ అమ్మవారిని 21 రకాల కాయగూరలు, 11 రకాల ఆకుకూరలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పేదలకు పట్టాలిచ్చే వరకూ పోరాటం

బత్తలపల్లి: పేదలకు పట్టాలిచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని సీపీఐ ధర్మవరం డివిజన్ కార్యదర్శి మధు పేర్కొన్నారు. బత్తలపల్లిలోని 401 సర్వే నంబర్‌లోని 19.84 ఎకరాల భూమిలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. శుక్రవారం స్థానికులతో కలిసి మధు విలేకర్లతో మాట్లాడారు. ఈ భూమిని నిడిమామిడి మఠానికి చెందిందని కొందరు అక్రమార్కులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. అయితే వాటికి అడ్డుకట్ట వేసి ప్రతి పేదకు అందేలా చూస్తామన్నారు. ఇప్పటికే రెవెన్యూ రికార్డుల ఆధారంగా మఠానికి చెందిన వారిని సంప్రదించామని వారు కూడా సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు పంపిణీ చేస్తే అభ్యంతరం లేదని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవి, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ఐదో సరిగెత్తు వేడుకలు



ఫకీరుబాబాలుగా దీక్ష స్వీకరిస్తున్న ముస్లింలు



కనగానపల్లిలో కొలువుదీరిన పీర్ల స్వాములు



మొహర్రం ఉత్సవాల్లో అన్నదానం చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మొహర్రంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఐదో సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. ఖాసీంస్వామికి నిత్యపూజ నివేదన నిర్వహించారు. ఉదయం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలి ఖాసీంస్వామి చావిడిలో ఫాతెహా చేశారు. ముస్లింలు తమ ఇళ్ల వద్ద నుంచి మేళాలతో ప్రత్యేకంగా చావిడి వద్దకు చేరుకుని ముజావర్లతో మెడలో దండ వేయించుకుని ఫకీరుబాబాలుగా దీక్ష స్వీకరించారు.

మొహర్రం సందడి షురూ

కనగానపల్లి: కనగానపల్లితో పాటు తగరకుంట, యలకుంట్ల, కోనాపురం, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో పండుగ సందడి కనిపిస్తోంది. కనగానపల్లిలో దస్తగిరి, కుళ్లాయి, వన్నూరుస్వాముల బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని దస్తగిరి స్వామి పీర్లచావిడి, ఆంజనేయస్వామి ఆలయాల ముందు ఉన్న ఆవరణల్లో మతసామరస్యానికి ప్రతీకగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. వీటిలో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు కర్నూలు, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కూడా వందల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఉత్సవాల్లో శుక్రవారం పీర్లస్వాములను చావిడిలో కొలువుదీర్చి నిత్యపూజ కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈనెల 14న చిన్న సరిగెత్తు, 15న విడిదినం, 16న పెద్ద సరిగెత్తుతో పాటు స్వామికి పానకాలు, గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. 17వ తేదీ బుధవారం పీర్లస్వాములతో అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధికి తీసుకెళ్తారు.